క్లుప్తంగా

దారి సౌకర్యం కల్పించండి



డీటీ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న బాధిత రైతులు

యాలాల: పొలాలకు వెళ్లేందుకు దారి సౌకర్యం కల్పించాలని సోమవారం డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ..గ్రామ శివారులోని సర్వే నంబరు 232లో పొలాలకు వెళ్లేందుకు ఉండే దారిని కొందరూ మూసేశారన్నారు. దీంతో ఆమార్గం గుండా పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ వాపోయారు. ఈ విషయం గురించి రెవెన్యూ అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బాధిత రైతులు కొప్పుల నర్సింహులు, ఎరుకలి మహేశ్, లక్ష్మప్ప, సాయిలు, శ్రీనివాస్, సంతోశ్, చాకలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంబలితో ఆరోగ్యం



అంబలి పంపిణీ చేస్తున్న నాయకులు


యాలాల: వేసవిలో అంబలి తాగితే ఆరోగ్యానికి రక్షణగా ఉంటుందని తాండూరు ఏఎంసీ డైరెక్టర్ గొనేగారి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, కాంగ్రెస్ నేత పేరి రాజేందర్‌రెడ్డి ఏర్పాటు చేయించిన చలివేంద్రంలో అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వేసవిలో వడదెబ్బ సోకకుండా ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. ప్రతీ సోమవారం వారంతపు సంతకు వచ్చే ప్రజలకు చల్లటి అంబలితో దాహం తీరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, నాయకులు రాపోలు నాగయ్య, రాములుగౌడ్, మలిగేరి నర్సింహులు, క్రిష్ణ, రమేష్, రజాక్, భాస్కర్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

కుల్కచర్ల: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీడీపీఓ మెహరున్నిసా అన్నారు. సోమవారం చౌడాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కోడిగుడ్లు బహిరంగ మార్కెట్‌లో విక్రయానికి పెట్టిన ఘటన మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా స్పందించిన ఆమె ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అంగన్‌వాడీ టీచర్‌ను సంజాయిషీ ఇవ్వాల్సిందిగా, మెమో జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని సామగ్రిని బహిరంగ మార్కెట్‌లో విక్రయించినా, సరఫరా చేసినా శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభులు, ఎంపీడీఓ సోమలింగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఆదర్శంగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: మహిళా సమాఖ్యలు ఆదర్శంగా నిలవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం ఏపీఎం సాయన్న ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఏర్పుమళ్లకు చెందిన గంజిపల్లి కవిత ఎన్నికయ్యారు. అనంతరం నిర్వహించిన సభలో శేరి రాజేశ్‌రెడ్డి మాట్లాడారు. మహిళా సమాఖ్యలు పకడ్బందీగా పనిచేసి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామల్లేశ్వర స్వామి అవతారంలో పరమశివుడు

తాండూరు టౌన్: వైశాఖ మాసం తొలి సోమవారం సందర్భంగా పట్టణంలోని శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి దేవస్థానంలోని శివాలయంలో పరమశివుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. సోమవారం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బోసిపోతున్న చెరువులు

- మరమ్మతులు చేపట్టని అధికారులు
- ఆయకట్టుకు సాగు నీరు కరువు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు



కొడంగల్ చెరువుకట్టపై ఏర్పడిన నెర్రెలు

కొడంగల్: నియోజకవర్గంలోని నోటిఫైడ్ చెరువులు కుంటలకు మరమ్మతులు లేక బోసిపోయాయి. సాగునీరు సక్రమంగా అందక ఆయకట్టు భూములు బీడుగా మారాయి. నోటిఫైడ్ చెరువుల కింద వేల ఎకరాల ఆయకట్టు ఉన్నాయి. దీంతో ఈ పరిధిలో పంటలు పండగ పొలాలు బీడులుగా మారాయి. అవీ ఇప్పుడు ఎడారిని తలపిస్తున్నాయి. నియోజకవర్గంలో వర్షాలు పడితేనే పంటలు పండుతాయి. వర్షాధార పంటలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. కొంతమంది రైతులు బోర్లు వేసుకొని పంటలు పండిస్తున్నారు. కొందరు చెరువులు, కాల్వల నీటితో వ్యవసాయం చేస్తున్నారు. వర్షం వస్తే చెరువుల్లో చేరాల్సిన నీరు, చెరువుల్లోకి చేరే అవకాశం లేకుండా తయారైంది. ఇక్కడ చెరువులు, కుంటల్లో మట్టి పేరుకపోయాయి. కాల్వలు, చెరువులకు మరమ్మతులు చేపట్టే అధికారులు కరువయ్యారు. దీంతో వరద నీరు చెరువుల్లోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

నియోజకవర్గంలోని చెరువులకు గతంలో చేసిన పనులు నామమాత్రంగా చేపట్టారు. నిజాం కాలంలో నిర్మించిన చెరువులకు మరమ్మతులు చేయకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. హస్నాబాద్ చెరువుకు 950 ఎకరాల ఆయకట్టు, కొడంగల్ చెరువుకు 550 ఎకరాల ఆయకట్టు ఉంది. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లోని చెరువులు, కుంటలు నిండడం లేదు. చెరువులు నిండక పోవడంతో పంటలు పండడం లేదు. కొడంగల్ మండలంలో 5 నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. వందలాది మంది రైతులకు చెరువుల కింద ఆయకట్టు భూములు ఉన్నాయి. మిషన్ కాకతీయ పనులు నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో నిర్వహించలేదు. నోటిఫైడ్ చెరువుల్లో పనులు పూర్తికాక పోవడంతో నీటి నిల్వ సామర్థ్యం లేక వెలవెల బోతున్నాయి. నియోజకవర్గంలో 461 చెరువులు, కుంటలు ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాటికి సరైన మరమ్మతులు చేయిస్తేనే పంటలు సంవృద్ధిగా పండించుకోవచ్చని పలువురు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నోటిఫైడ్ చెరువులు, కుంటలను పరిరక్షించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముద్దాయిపేటలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



ముద్దాయిపేటలో గ్రాడ్యుయేషన్ డే సంబరాలు

యాలాల: మండలంలోని ముద్దాయిపేట అంగన్‌వాడీ ప్రీ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. సంగాయగుట్టతండా, అచ్యుతాపూర్ కేంద్రాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లస్టర్ సూపర్‌వైజర్ రాణి మాట్లాడుతూ..ప్రీ స్కూల్ సంసిద్ధతలో భాగంగా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోషణ్ పక్షంలో భాగంగా అంగన్‌వాడీల్లో పలు రకాల కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. పోషణ్ భీ..పడాయి భీ కార్యక్రమంలో భాగంగా దేశీయ బొమ్మలతో ఆట ఆధారిత అభ్యాసంపై ప్రదర్శనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సబియాబేగం, పద్మావతి, జ్యోతి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సీనియర్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌మై



అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న కిరణ్‌మై

బంట్వారం: కేంద్రం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార శాఖ జిల్లా సీనియర్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌మై పేర్కొన్నారు. సోమవారం బంట్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కేంద్ర ప్రభుత్వ పథకాలపై రైతులకు పలు సూచనలు చేశారు. నాబార్డు సంస్థ అమలు చేస్తున్న ఎఫ్‌పీఓపై అవగాహన ఉండాలన్నారు. సొసైటీలో సభ్యులుగా లేని వారు సభ్యత్వం తీసుకోవాలన్నారు. అంతకు ముందు అంతర్జాతీయ సహకార సంస్థ 2025పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ బ్రహ్మం, సంఘం డైరెక్టర్లు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులతో ఉపయోగం

మండల విద్యాధికారి గోపాల్



నోటుపుస్తకాలు అందజేస్తున్న శ్రీశైలం

పరిగి: సమ్మర్ క్యాంపులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మండల విద్యాధికారి గోపాల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మిట్టకోడూర్ ప్రాథమిక పాఠశాలలో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేశారు. సోమవారం మండల పీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు శ్రీశైలం విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, తదితర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులతో విద్యార్థులు ముందస్తుగా చదువుకొని రాణిస్తారన్నారు. 80మంది విద్యార్థులు ఈ క్యాంపులకు హాజరుకావడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ ప్రత్యేక క్యాంపుల ద్వారా విద్యార్థులకు సృజనాత్మకత పెరుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, ఇతర వస్తువుల తయారీ నేర్చుకుంటారన్నారు. ఎండా కాలంలో విద్యార్థులు బయట తిరిగి కాలాన్ని వృథా చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్‌అలీ, మాజీ సర్పంచ్ జగదీశ్, శిక్షణ ఫౌండేషన్ సభ్యుడు హన్మంతు, ఉపాధ్యాయులు కృష్ణ, ఎమ్మార్సీ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన

పరిగి: భూ భారతి చట్టంపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తునట్లు తహసీల్దార్ ఆనంద్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ సదస్సు ఉంటుందని తెలిపారు. అవగాహన సదస్సుకు స్థానిక ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ హాజరవుతారని పేర్కొన్నారు. కావున మండలంలోని రైతులు అందరు హాజరు కావాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మోమిన్‌పేట: పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు

మోమిన్‌పేట: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. మోమిన్‌పేట బాలుర ఉన్నత పాఠశాలలో 2001-02 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒక దగ్గరకు చేరి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమ తమ కుటుంబ యోగక్షేమాన్ని తెలుసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులు రుక్కయ్య, నారాయణరెడ్డి, వెంకటయ్య, జనార్ధన్‌రావు, అంజయ్య, పాండు, బక్కప్ప, సుభాష్‌రావు, సత్యానందం, వీరమణి, ఖాజపాష, వసంత్, చంద్రశేఖర్, మల్లేశం ఉపాధ్యాయులకు పాద పూజ చేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

పరిగిలో..

పరిగి: పట్టణ కేంద్రంలోని నంబర్ 1 ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2006-07 పదోతరగతి విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో కలిసి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేసిన అల్లరి పనులను గుర్తుచేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

అభివృద్ధి, సంక్షేమంలో కాంగ్రెస్ విఫలం

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

యాలాల: అభివృద్ధి, సంక్షేమంలో అధికార కాంగ్రెస్ విఫలమైందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మండల యూత్ అధ్యక్షుడు విక్రాంత్, ప్రధాన కార్యదర్శి క్రిష్ణకుమార్, మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, పటేల్‌రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను కార్యకర్తలు విజయవంతం చేశారన్నారు. 16 నెలలుగా కాంగ్రెస్ పాలన విఫలమైందన్నారు. హైడ్రా, లగచర్ల, హెచ్‌సీయూ ఘటనలతో పార్టీ నిజస్వరూపం బయటపడిందన్నారు. వరంగల్ సభను అడ్డుకునేందుకు అధికార కాంగ్రెస్ రకరకాలుగా యత్నించిందని గుర్తు చేశారు. అధికార కాంగ్రెస్ తన ఎన్నికల హామీలను తుంగలో తొక్కిందని, రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్ పాలనను గుర్తు చేసుకుంటున్నారన్నారు. రానున్న కాలంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఉనికి కాపాడుకునేందుకే సభ

యాలాల: బీఆర్‌ఎస్ ఉనికి కాపాడుకునేందుకే రజతోత్సవ సభ నిర్వహించారని యాలాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరేశం విమర్శించారు. బీఆర్‌ఎస్ సభలో మాజీ సీఎం ప్రసంగం తుస్సుమందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీపై కేసీఆర్ విమర్శలు చేయడం తగదన్నారు. గత బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని పార్టీ బీఆర్‌ఎస్ అని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో రూ.2లక్షల రుణమాఫీ, సన్నబియ్యానికి బోనస్, రేషన్ షాపుల ద్వారా పేదవారికి సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలతో కాంగ్రెస్ సర్కారు ప్రజలకు దగ్గరవుతుందన్నారు. ఇది జీర్ణించుకోలేకనే బీఆర్‌ఎస్ విమర్శలకు దిగుతుందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో వారు తగిన బుద్ధి చెబుతారన్నారు.

'స్థానిక' ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధం

బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, ఇన్‌చార్జి శంకర్



మాట్లాడుతున్న మల్లేశం

మర్పల్లి: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రతి జీపీ నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, ఇన్‌చార్జి ప్యాట శంకర్ కార్యకర్తలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో పార్టీ బలోపేతం కోసం చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేదలకు అందేవిధంగా చూడాలన్నారు. పార్టీకోసం పనిచేసే ప్రతీ కార్యకర్తను అధిష్ఠానం గుర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మండల మహిళామోర్చా అధ్యక్షురాలు అన్నపూర్ణ, జిల్లా నాయకుడు బలరాంగౌడ్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టేకులపల్లిలో బీరప్ప కల్యాణం

మోమిన్‌పేట: మండల పరిధిలోని టేకులపల్లి, ఎన్కతల గ్రామాల్లో బీరప్ప జాతర సందర్భంగా సోమవారం బీరప్ప-కామరతి కల్యాణం నిర్వహించారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయం ఎదుట పందిరి వేసి గొల్ల బీరులు కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయండి

- మావోయిస్టు పార్టీ నాయకులతో చర్చలు జరపాలి
- ప్రజా, వామపక్ష, విద్యార్థి సంఘాల డిమాండ్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వామపక్ష, విద్యార్థి సంఘాల నాయకులు

తాండూరు టౌన్: తెలంగాణ, చత్తీస్‌ఘడ్ సరిహద్దుల్లోని కర్రె గుట్టల్లో మావోయిస్టులను ఏరి వేసేందుకు నిర్వహిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలని వామపక్ష, ప్రజా, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ మావోయిస్టులను అంతమొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ కగార్ బూటకపు ఆపరేషన్‌నని పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్‌ను అడ్డు పెట్టుకుని మావోయిస్టులను అంతమొందించడం, ఆదివాసీ గూడేలు లేకుండా చేయడమేనన్నారు. తద్వారా ఆ ప్రాంతంలో లభ్యమయ్యే 84 రకాల ఖనిజాలను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడం కోసమే ఈ చర్య చేపడుతున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ వల్ల మావోయిస్టులతో పాటు అమాయక ఆదివాసీలు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్యను వెంటనే నిలిపివేయాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ నిరసనలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి పండిట్, కేఎస్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రప్ప, తెలంగాణ జన సమితి తాండూరు ఇన్‌చార్జి సోమశేఖర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కలు ఎండకుండా పరిరక్షించాలి

ఎంపీడీఓ రాములు



మద్వాపూర్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న రాములు

బంట్వారం: నర్సరీలో మొక్కలు ఎండకుండా చూసుకోవాలని ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మద్వాపూర్ గ్రామాన్ని సందర్శించి నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శికి, ఈజీఎస్‌కి పలు సూచనలు చేశారు. వానా కాలం నాటికి నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలన్నారు. మొక్కలు ఎండకుండా ప్రతిరోజు నీరు పట్టాలన్నారు. అనంతరం ఆయన కంపోస్టు షెడ్, క్రిమటోరియంను సందర్శించి వాటి స్థితిగతులను తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యంపై ఆరా తీశారు. ఎంపీడీఓ వెంట ఎంపీఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అర్జీలను స్వీకరించి, పరిశీలించి మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి తిరుపతిరెడ్డి



కొడంగల్: చెక్కు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: సీఎం సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి ఎనుముల తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన బాధితులకు సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలోని కడ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల, దౌల్తాబాద్, కోస్గి, మద్దూరు, గుండుమాల్, కొత్తపల్లి మండలాలకు చెందిన 179 మంది లబ్ధిదారులకు రూ.93లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ప్రజలందరికీ అండగా ఉంటామన్నారు. పలు సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన చికిత్స చేయించుకోవడానికి ఇవి ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నందారం ప్రశాంత్, నర్సిములు గౌడ్, ఆనంద్‌రెడ్డి, వెంకటయ్య గౌడ్, రామచంద్రారెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

పరిగి: సీఎం సహాయనిధిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సయ్యద్‌పల్లి గ్రామానికి చెందిన కొత్తూరు చిన్నమల్లేషం అనారోగ్యానికి గురవ్వడంతో చికిత్స చేయించుకున్నాడు. దీంతో ఆయన సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో మంజూరైన రూ.44వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పరశురాంరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరికి సీఎం సహాయనిధి అందజేస్తున్నామన్నారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని పేదల సంక్షేమానికి తాము నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళా సంఘం సభ్యులతో అధికారులు

తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్ రూరల్: మహిళలు పొదుపు చేసుకుంటూ ఆర్థికంగా ఎదిగేందుకు కృషిచేయాలని తహసీల్దార్ విజయకుమార్ సూచించారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశం హాల్లో 18వ వార్షిక మహిళా మండలి సమాఖ్య సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకులు అందించే రుణాలను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి చెందాలన్నారు. మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించడంలో మహిళా సంఘాలే కీలకంగా పనిచేస్తాయన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషిచేయాలన్నారు. అనంతరం డీపీఎం రా మ్మూర్తి ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్య లు కొత్త ఓబీలుగా అధ్యక్షురాలిగా అంగడిరాయిచూర్ ఎం.అంజమ్మ, విఓ కార్యదర్శిగా రుద్రారం మ ననమ్మ, విఓ-1 కోశాధికారిగా ఆలేడు సత్యమ్మల ను ఎన్నుకున్నారు. ఏపీఎం వెంకన్న, సీ సీలు వాణిశ్రీ, గుమ్మి రాములు, బస్వంత్‌కుమార్, ఆర్.రాములు, వెంకటయ్య, మోనమ్మ, నర్సిములు పాల్గొన్నారు.

విభేదాల్లేవ్..

- బషీరాబాద్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల వెల్లడి
- 'సాక్షి' కథనంతో ఎమ్మెల్యే దిద్దుబాటు చర్యలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బషీరాబాద్: అధికార పార్టీలో అంతర్గత పోరు లేదని మండల కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. తమ మధ్య బిన్నాభిప్రాయాలేతప్పా.. విబేధాలు లేవని నేతలు సంయుక్త ప్రకటన చేశారు. 'అధికార పార్టీలో అంతర్గత పోరు' శీర్షికన 'సాక్షి' వెలువరించిన కథనంతో తాండూరు నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. రంగంలోకి దిగిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. బషీరాబాద్ మండల కాంగ్రెస్ సీనియర్ నేతలతో ఫోన్‌లో మాట్లాడారు. పార్టీకి నష్టం కలిగేలా ఎవరు మాట్లాడొద్దని, గ్రూపులకు తావులేకుండా కలిసికట్టుగా పనిచేయాలని వారికి సూచించారు. పార్టీలో ఆదిపత్య పోరు కోసం గ్రూపులు కట్టి పార్టీకి నష్టం కలిగిస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో సోమవారం బషీరాబాద్‌లోని పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ నివాసంలో ముఖ్య నేతలు చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, సీనియర్ నాయకులు శంకర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమలో ఎలాంటి కుమ్ములాటలు, గ్రూపులు లేవన్నారు. మండలంలోని నాయకులమంతా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ బలోపేతం కోసం పనిచేస్తామని ప్రకటించారు. త్వరలో ఎమ్మెల్యేతో మండల నాయకులంతా బేటీ కానున్నట్లు పేర్కొన్నారు.